క్లుప్తంగా

దేవాలయానికి రూ.లక్ష విరాళం



నగదు అందిస్తున్న బండారు ఉపేంద్రం

తల్లాడ: మండలంలోని మల్లవరం గ్రామ సెంటర్‌లోని ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయానికి బుధవారం వ్యాపారి బండారు ఉపేంద్రం రూ.లక్ష నగదును విరాళంగా అందించారు. గ్రామానికి చెందిన ఆయన దేవా లయ అభివృద్ధికై విరాళం ఇస్తున్నట్లు ప్రకటించారు. దీంతో ఉపేంద్రను ఆలయ కమిటీ శాలు వాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తల్లాడ సొసైటీ వైస్ చైర్మన్ కటికి నరసింహారావు, దేవాలయ కమిటీ నిర్వాహకులు దుగ్గి దేవర వెంకట్‌లాల్, చాపల బిక్షమయ్య, కటికి వెంకటేశ్వర్లు, నల్లగొండ శేషయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రికి స్థలం కేటాయింపు

ఎర్రుపాలెం: మండలంలోని 30 పడకల ఆస్పత్రి నిర్మించేందుకు గానూ.. తహసీల్దార్ స్థలాన్ని కేటాయించారు. మండలంలోని విద్యుత్ కార్యాలయ సమీపంలో ఉన్న మూడు ఎకరాల స్థలాన్ని తహసీల్దార్ ఎం.ఉషాశారద.. డీసీహెచ్ఎస్ డాక్టర్ రాజశేకర్‌గౌడ్‌కు అప్పగించారు. ఈ కార్యక్రమంలో మధిర ఆస్పత్రి వైద్యాధికారి అనీల్‌కుమార్, ఆర్ఐలు రవికుమార్, రజశేఖర్, సర్వేయర్ రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

ఆయుర్వేద వైద్యశాలకు యోగా శిక్షకులు

కొణిజర్ల: కొణిజర్ల పీహెచ్‌సీ పరిధిలో గల ప్రభుత్వ ఆయుర్వేద డిస్పెన్సరీకి రాష్ట్ర ప్రభుత్వం ఇద్దరు యోగా శిక్షకులను నియమించింది. ఈ మేరకు స్త్రీ, పురుష యోగాశిక్షకులు ఇద్దరు బుధవారం ఆయుర్వేద వైద్యాధికారి తన్నీరు రాంప్రసాద్‌ను కలిసి విధుల్లో చేరారు. ఈ సందర్భంగా రాంప్రసాద్ మాట్లాడుతూ.. దీర్ఘకాలిక వ్యాధి గ్రస్తులు, కీళ్ల నొప్పులు, మోకాళ్ల నొప్పులు గర్భిణులు, బాలింతలు ప్రాణాయామం, యోగాసనాలు వేయడం ద్వారా ఉపశమనం పొందవచ్చన్నారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సెల్ టవర్ ఏర్పాటుపై రగడ

సత్తుపల్లిటౌన్: ఓ చోట అనుమతి తీసుకుని మరో చోట సెల్ టవర్ ఏర్పాటుచేశారనే ఫిర్యాదుతో బుధవారం సత్తుపల్లిలో ఆందోళన నెలకొంది. స్థానిక తుమ్మూరు రామారావు వీధిలోని ఓ ఇంటిపై టవర్ ఏర్పాటుకు అనుమతి తీసుకోగా, మసీద్‌రోడ్‌లోని ఇంటిపై నిర్మాణం నిర్మించారు. ఈ అంశంపై స్థానికుల ఫిర్యాదుతో మున్సిపల్ కమిషనర్ మందా రవిబాబు పరిశీలించి టవర్ సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. ఈక్రమాన కమిషనర్, ఉద్యోగులతో ఇంటి యజమాని జాకీర్ వాగ్వాదానికి దిగారు. ఆధార్‌లో చిరునామా అప్‌డేట్ కాక ముందు పాత అడ్రస్‌తో అనుమతి తీసుకున్నారని ఆయన పేర్కొన్నారు.

మెనూ ప్రకారం భోజనం వడ్డించాలి

బోనకల్: పాఠశాలల్లో పిల్లలకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని తహసీల్దార్ పున్నం చందర్ అన్నారు. బుధవారం మండలంలోని రావినూతల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంపీడీఓ రమాదేవి, ఎంఈఓ దామాల పుల్లయ్య లతో కలిసి పరిశీలించారు. విద్యార్థులకు సరిపడా భోజనం వడ్డించాలని వర్కర్లకు సూచించారు.

సర్వే త్వరగా పూర్తి చేయాలి

వైరారూరల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ నిర్ధారణ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని డీఎల్‌పీఓ రాంబాబు సూచించారు. మండలంలోని రెబ్బవరం గ్రామంలో బుధవారం ఆయన ఎంపీఓ జ్యోత్స్నదేవితో కలిసి సర్వేను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి సర్వే పూర్తి చేయాలన్నారు. కార్యదర్శి కృష్ణ, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్లకు మరమ్మతులు చేయాలి

బోనకల్: డబుల్ బెడ్‌రూం ఇళ్లకు మరమ్మతులు చేపట్టాలని సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని రావినూతల గ్రామంలోని డబుల్ బెడ్రూం ఇళ్ళ కాలనీని సీపీఐ బృందం పరిశీలించి.. లబ్ధిదారుల సమస్యలు తెలుసుకున్నారు. లబ్ధిదారులకు ఇచ్చిన ఇళ్లన్నీ స్లాబులకు పగుళ్లు వచ్చి, నెర్రలు బారాయన్నారు. వర్షం వస్తే కారడమే కాకుండా గోడలకు విద్యుత్ సరఫరా అవుతుందన్నారు. సదరు కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడం వలనే ఈ రోజు ఇళ్లు ఇలా శిథిలమయ్యాయన్నారు. కనీసం ఇకనైనా అధికారులు, ప్రభుత్వం కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవడంతో పాటు మరమ్మతులు చేయించాలని కోరారు. ఆ పార్టీ నాయకులు ఆకెన పవన్, మనీష్, జయరాజు పాల్గొన్నారు.

ప్రాణాంతకం కోనోకార్పస్

- పర్యావరణానికి హాని కలిగిస్తున్న మొక్కలు
- తొలగించడంలో అధికారుల నిర్లక్ష్యం
- ఇకనైనా స్పందించాలని కోరుతున్న పర్యావరణ ప్రేమికులు



అంజనాపురం రోడ్డు పక్కన ఏపుగా పెరిగిన కోనోకార్పస్ మొక్కలు

కొణిజర్ల: పట్టణాలు, గ్రామాల సుందరీకరణలో భాగంగా గత ప్రభుత్వ హయాంలో నాటిన కోనోకార్పస్ మొక్కలు పర్యావరణానికి పెను ముప్పుగా తయారయ్యాయి. ప్రజలలో శ్వాసకోశ సంబంధిత వ్యాధులకు కారణమవుతున్న ఈ మొక్కలను తొలగించాలని పలువురు పర్యావరణ వేత్తలు చెబుతున్నా అధికారులు అక్కడక్కడా మాత్రమే తొలగించి చేతులు దులుపుకున్నారు. ఏపుగా పెరుగుతున్న ఈ మొక్కలు వాటి పరిసరాలలో మరే మొక్కను పెరగనివ్వకుండా పర్యావరణానికి హానీ కలిగించడంతో పాటు ఇటు మనుషులకు అటు జంతువులకు కూడా హాని కలిగిస్తున్నాయి. ఒక్క పిట్ట కూడా ఈ చెట్ల మీద వాలడం లేదంటే ఈ చెట్లు పర్యావరణానికి ఎంత హానికరమో అర్థంఅవుతుంది.

దాదాపు అన్ని జీపీల్లో..

కొణిజర్ల మండలంలో మొత్తం 27 పంచాయతీలున్నాయి. గత ప్రభుత్వ హయాంలో అన్ని పంచాయతీల్లో పచ్చదనం పరిశుభ్రత హరితహారం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం కోనోకార్పస్ ఒక్కో మొక్క రూ.50 పెట్టి కొనుగోలు చేసి చేసి నాటించారు. వారాల వ్యవధిలోని మొక్కలు విపరీతంగా పెరిగి వేర్లు కూడా భూమిలోకి లోతుగా వెళ్లి వాటి పరిసరాల్లో మరే మొక్కను పెరగనివ్వకుండా చేస్తున్నాయి.

చూడడానికే ఆహ్లాదం..

పచ్చదనంతో నిండుకుని ఉన్న ఈ చెట్లను చూస్తే ఆహ్లాదకరంగానే ఉంటుంది. కానీ మొక్కలు పూతకు వచ్చినప్పుడే అత్యంత ప్రమాదకరంగా ఉంటుంది. ఈ మొక్కల నుంచి వెలువడే పుప్పొడి రేణువుల వల్ల అలర్జీ, శ్వాసకోశ వ్యాధులు, ఆస్తమా వంటి జబ్బులు రావడమే కాకుండా చివరికు అది కేన్సర్‌కు దారి తీసే అవకాశం ఉందని శాస్త్రవేత్తల పరిశోధనలో తేలింది. దీంతో ఈ మొక్కలను తొలగించాలని గత ప్రభుత్వ హయాంలోనే అధికారులు తీర్మానం చేసినప్పటికీ అక్కడక్కడా రోడ్డు పక్కన ఉన్న చెట్లు తొలగించారు. కానీ గ్రామాల్లో ఉన్న చెట్లు మాత్రం పూర్తి స్థాయిలో తొలగించలేదు. అనేక పంచాయతీల్లో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాల్లో ఈ మొక్కలే ప్రధానంగా కనిపిస్తున్నాయి. ఈ చెట్ల వలన పక్షులు, జంతువులకు కూడా ఎటువంటి ఉపయోగం లేదు. జంతువులు ఆకులను తినవు, ఏ పక్షి ఈ చెట్టుపై గూడు కట్టదు. దీనికి తోడు రోడ్డు పక్కన నాటిన ఈ మొక్కల వేళ్లు భూమిలోకి లోతుగా పాతుకుపోయి అడ్డు వచ్చే కేబుల్ వైర్లు, వాటర్ పైప్‌లైన్లను ధ్వంసం చేస్తున్నాయి. మండల కేంద్రం కొణిజర్లలో ఈ మొక్కలను తొలగించారు. కానీ మిగిలిన గ్రామల్లో ఏపుగా పెరిగి దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా మొక్కలు



బస్వాపురం రైతు వేదికలో..

తొలగించి పర్యావరణానికి హాని కలిగించే మొక్కల నుంచి ప్రజలకు, జంతువులకు రక్షణ కల్పించాలని పలువురు కోరుతున్నారు.

పర్యావరణానికి పెనుముప్పు..



కోనోకార్పస్ మొక్కల వల్ల కేన్సర్ వచ్చే అవకాశం ఉంది. ఆ మొక్కల పూల నుంచి వచ్చే పుప్పొడి వల్ల ఆస్తమా, ఎలర్జీ, వంటి జబ్బులు వస్తాయి. పర్యావరణ సమతుల్యతను దెబ్బతీస్తున్న ఈ మొక్కలను తక్షణమే తొలగించడం మంచిది.

– తాతా రామారావు, లెక్చరర్, కొణిజర్ల

అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించాలి..



కోనోకార్పస్ మొక్కలు బస్వాపురం రైతు వేదిక వద్ద నాటారు. నిత్యం పదుల సంఖ్యలో రైతులు వచ్చివెళ్తుంటారు. మొక్కలు ప్రాణాంతకమని తెలిసినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇకనైనా తొలగించి నీడనిచ్చేవి లేదా పండ్ల మొక్కలు నాటాలి.

– నెల్లూరి రమేష్, సొసైటీ వైస్ చైర్మన్, కొణిజర్ల

పంట అవశేషాలను కాల్చకండి

చింతకాని: పంట అవశేషాలను కాల్చకూడదని మధిర వ్యవసాయ సహాయ సంచాలకుడు విజయ్ చంద్ర తెలిపారు. బుధవారం మండలంలోని నేరడలోని రైతులకు అవగాహన కల్పించి మాట్లాడుతూ.. పత్తి, వరి పంటలను భూమిలో కలియదున్నకుండా కాల్చడం వలన భూమిలో ఉండే వివిధ రకాల సూక్ష్మజీవులు చనిపోవటం జరుగుతుందని తెలిపారు. అలాగే భూమిలో 2శాతం ఉండాల్సిన సేంద్రియ కార్బనం ఒక శాతానికి పడిపోవడం జరుగుతుందన్నారు. తద్వారా పంటలు పండించుకోవటానికి భూమి పనికిరాకుండా పోతుందని, వాతావరణ కాలుష్యాన్ని కూడా తగ్గించి భూమిలోని తేమ శాతాన్ని కాపాడుకోవచ్చన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న మధిర ఏడీఏ విజయ్ చంద్ర

కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి మానస, వ్యవసాయ విస్తరణాధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

విచ్చలవిడిగా యాంటీ బయోటిక్స్ వాడొద్దు..



ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది, స్థానికులు

తల్లాడ: రోగులు విచ్చలవిడిగా యాంటిబయోటిక్స్ మందులు వాడొద్దని తల్లాడ పీహెచ్‌సీ వైద్యాధికారి ఐ.రత్న మనోహర్ అన్నారు. బుధవారం తల్లాడ పీహెచ్‌సీలో వైద్యసిబ్బంది అవగాహన కల్పించి.. రోగులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్యుల సలహామేరకే మందులు వాడాలని, ఎవరికిష్టమొచ్చినట్లు యాంటీ బయోటిక్ మందులు వాడితే అనేక దుష్ఫలితాలు కలుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఓ భాస్కర్, సూపర్‌వైజర్ పెద్దపుల్లయ్య, భద్రమ్మ, స్టాఫ్ నర్సులు కళావతి, రాజశ్రీ పాల్గొన్నారు.

ఓర్వలేకనే విమర్శలు

సత్తుపల్లిటౌన్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేకనే మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య విమర్శలు చేస్తున్నారని సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ తోట సుజలరాణి ఆరోపించారు. బుధవారం సత్తుపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ప్రజలే తగిన బుద్ధి చెబుతారనఅరు. పేదలకు అండగా కాంగ్రెస్ ఎల్లప్పుడు ఉంటుందన్నారు. ఈ సమావేశంలో సొసైటీ ఉపాధ్యక్షుడు గాదె చెన్నారావు, ఎండీ కమల్‌పాషా, గంధ్ర సారధిరెడ్డి పాల్గొన్నారు.

భవనాల మరమ్మతులకు ప్రతిపాదనలు

ముదిగొండ: డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క ఆదేశాలతో మండలపరిధిలోని వనంవారికిష్టాపురంలో పశువైద్యశాల, ఆరోగ్య ఉపకేంద్రం, జెడ్పీఉన్నత పాఠశాల భవనాల మరమ్మతులకు ప్రతిపాదనలు వచ్చాయి. బుధవారం ఆయా భవనాలను పంచాయతీ రాజ్ ఏఈ రాంబాబు వాటికి సంబంధించిన ప్రతిపాదనలు తయారు చేశారు. త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

పరిమితికి మించి తీసుకెళ్లొద్దు..

తల్లాడ: ఆటోలు, ట్రాలీ ఆటోలు, మినీ వ్యాన్లలో పరిమితికి మించి కూలీలను, ప్రజలను ఎక్కించుకుని తీసుకెళ్లొద్దని తల్లాడ ఎస్సై బి.కొండల్‌రావ్ అన్నారు. ఈ సందర్భంగా తల్లాడలో పలు ఆటోల యజమానులకు అవగాహన కల్పించి.. పలువురుకి ఫైన్ వేశారు. మరికొన్ని వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ఇటీవల పలు మండలాల్లో ఆటో యజమానులు అత్యాశతో పరిమితికి మించి కూలీలను ఎక్కించుకొవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ..

చింతకాని: మండలంలోని ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ నాయకుడు కట్టా వెంకటేశ్వర్లును ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ బుధవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సునీల్ కుమార్ మాదిగ, మాజీ మండల అధ్యక్షుడు రాంబాబు, మండల అధ్యక్షుడు ఉపేందర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు కృత్రిమ గర్భధారణ

కల్లూరురూరల్: కృత్రిమ గర్భధారణ ద్వారానే మేలురకపు పశుసంతతి పెంపొందుకోవాలని వెటర్నరీ డాక్టర్ మమత రైతులకు సూచించారు. మండలంలోని లక్ష్మీపురంలో బుధవారం పశుసంవర్ధక శాఖ, పశుగణాభివృద్ధి సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత పశువైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. గేదెలు చలికాలంలో ఎక్కువగా ఎదకు వస్తాయని, రైతులు సకాలంలో ఈ విషయాన్ని గుర్తించి సమీపంలోని పశువైద్యశాలలో లేక గోపాలమిత్రల ద్వారా కృత్రిమ గర్భధారణ చేయించాలని కోరారు. ఈ సందర్భంగా 38 పశువులకు గర్భకోశ చికిత్సలు నిర్వహించి 56 దూడలకు నట్టల మందు తాగించారు. కార్యక్రమంలో



లక్ష్మీపురంలో పశువైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

వీఎల్‌ఓ శ్రీనివాసరావు, గోపాలమిత్ర సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, గోపాలమిత్రలు ఖమ్మంపాటి అప్పారావు, కృష్ణప్రసాద్, విజయ్‌కుమార్, మాధవి, రైతులు పాల్గొన్నారు.

కూలీలకు రూ. 12 వేలు జీవన భృతి ఇవ్వాలి

కొణిజర్ల: వ్యవసాయ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఏడాదికి రూ.12 వేలు జీవన భృతి ఇవ్వాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా నాయకుడు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కంకణాల అర్జున్‌రావు డిమాండ్ చేశారు. మండలంలోని సింగరాయపాలెంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కంకణాల పెద్ద వెంకటి, మేడి కొండలరావు, నునావత్ లీలా, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రైతుల పక్షపాతి రేవంత్‌రెడ్డి



మాట్లాడుతున్న మొక్క శేఖర్ గౌడ్

వైరా: రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను కాంగ్రెస్ ప్రభుత్వం కొనుగోలు చేయడమే కాకుండా రూ.500 బోనస్ అందించి సీఎం రేవంత్ రెడ్డి రైతుల పక్షపాతిగా నిలుస్తున్నారని జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మొక్క శేఖర్ గౌడ్ తెలిపారు. బుధవారం వైరాలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో.. కిసాన్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాధవరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రైతుల పరిస్థితి ప్రశ్నార్థకమైందన్నారు. సమావేశంలో బొళ్ల గంగారావు, పమ్మి అశోక్, దార్నా రాజశేఖర్, వేల్పుల భరత్, తెళ్లూరి వీరయ్య పాల్గొన్నారు.

హరీశ్‌రావు పర్యటనను విజయవంతం చేయాలి

చింతకాని: ఈనెల 22న మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు నిర్వహించనున్న మండల పర్యటనను విజయవంతం చేయాలని మాజీ జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ అన్నారు. బుధవారం మండలంలోని ప్రొద్దుటూరులో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ మంత్రి ముందుగా పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాన్ని, అనంతరం అక్రమకేసులతో జైలుకు వెళ్లివచ్చిన బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పుల్లయ్య కుటుంబాన్ని పరామర్శిస్తారని తెలిపారు. కావున పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి వెంకట్రామయ్య, నాయకులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేత

ఎర్రుపాలెం: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా మండలకేంద్రంలో విద్యార్థులకు మండల స్థాయిలో వ్యాసరచన డిబేట్, క్రీడలను నిర్వహించారు. ఈ పోటీల్లో మీనవోలు శ్రీ భాస్కర స్కూల్ విద్యార్థులు అన్ని పోటీల్లో ప్రథమ స్థానాలు సాధించి బహుమతులు గెలుచుకున్నారు. దీంతో ఆ పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో విజేతలను పాఠశాల డైరెక్టర్ వెంకటేశ్వరరావు, కరస్పాండెంట్ సూర్య నారాయణ, ఉపాధ్యాయులు అభినందించారు. రావు తదితరులున్నారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు..

ముదిగొండ: కొనుగోలు కేంద్రాల్లో రైతులను ఇబ్బంది పెట్టొదని ఖమ్మం ఆర్డీఓ గరిడి నరసింహారావు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ముదిగొండ, గోకినేపల్లి, న్యూలక్ష్మీపురం గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. గోకినేపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన స్థానిక రైతులతో మాట్లాడారు. అనంతరం తహసీల్‌లో.. తహసీల్దార్ సునీత ఎల్జిబెత్, ఎంఈఓ రమణయ్యను కలిసి సమగ్ర సర్వేపై వివరాలు తెలుసుకున్నారు. ప్రతీ ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వెళ్లి వివరాలు సమగ్రంగా సేకరించాలని ఆదేశించారు. ముదిగొండ, న్యూలక్ష్మీపురంలోని సమగ్ర కుటుంబ సర్వేని పరిశీలించారు. జిన్నింగ్ మిల్లులో పత్తి సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. పత్తి తేమశాతాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్ఐ లు వహిదా, ప్రసన్నకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



ముదిగొండ: గోకినేపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ నరసింహారావు

నిబంధనల పేరుతో పత్తిని వెనక్కి పంపొద్దు..

తల్లాడ: సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో నిబంధనల పేరుతో పత్తిని తిరిగి వెనక్కి పంపొద్దని.. అఖిల భారత ప్రగతి శీల రైతు సంఘం రాష్ట్ర నాయకుడు గుర్రం అచ్చయ్య అన్నారు. బుధవారం తల్లాడలోని సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి.. రైతుల సాధక బాధల గురించి విన్నారు. రైతులు తెచ్చిన పత్తిని అవసరమైతే తమ దగ్గర దించుకొని తేమ శాతం వచ్చిన తర్వాత కాంటా వేసుకొని రైతులకు సౌకర్యంగా ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో అఖిలభారత రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మలీదు నాగేశ్వరరావు, నాయకులు సీ.వై.పుల్లయ్య, డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పాఠశాలలకు క్రీడా సామగ్రి అందజేత

వేంసూరు హైస్కూల్‌కు..

వేంసూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు సత్తుపల్లి లయన్స్ క్లబ్ సభ్యులు రూ.10 వేల విలువచేసే క్రీడా సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు దారా కృష్ణారావు, గంధ్ర సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైరాలోని యూపీఎస్, మండలంలోని రెబ్బవరం పాఠశాలకు..

వైరారూరల్: వైరా పట్టణ కేంద్రంలోని యూపీఎస్, మండలంలోని రెబ్బవరం జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలకు బుధవారం వైరా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా యువత సాధికారత శిక్షణ తరగతుల చైర్మన్ మదన్‌మోహన్ రేపాల ఆర్థిక సాయంతో రూ.20 వేలు విలువ చేసే క్రీడా సామగ్రిని లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ పాస్ట్ గవర్నర్ డాక్టర్ మురళీకృష్ణ చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ కొత్తపల్లి వెంకటేశ్వర్లు, లయన్స్‌క్లబ్ బాధ్యులు చింతలపూడి వెంకటేశ్వర్లు, ఉండ్రూ శ్యాంబాబు, డీసీపీ రావు, లగడపాటి ప్రభాకర్, పెనుగొండ ఉపేంద్రరావు, అబ్బూరి రమేష్, మరికంటి రాంగోపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీయంబంజర్ పాఠశాలకు..

పెనుబల్లి: సప్తపది లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని వీయంబంజర్ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. లయన్స్‌క్లబ్ బాధ్యులు రేపాల మదన్ మోహన్ ఇచ్చిన రూ.9 వేల ఆర్థిక సాయంతో పాఠశాలలో



పెనుబల్లి: విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేస్తున్న సప్తపది లయన్స్‌క్లబ్ సభ్యులు

విద్యార్థులకు ఉపయోగపడే క్రీడా సామగ్రిని అందజేసినట్లు క్లబ్ అధ్యక్షులు ఎస్.సుబ్బారావు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ బాధ్యులు మిట్టపల్లి జనార్ధన్, ఎస్‌కె అబ్దుల్ సలాం, శ్రీదర్, ఆనంద్, సత్యనారాయణ, ప్రభాకర్‌రెడ్డి, గంధ్ర సోమిరెడ్డి సత్యనారాయణ, బండి రాము తదితరులు పాల్గొన్నారు.

అన్నారుగూడెం, తల్లాడ జెడ్పీ పాఠశాలలకు..

తల్లాడ: తల్లాడ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం అన్నారుగూడెం, తల్లాడ జెడ్పీ పాఠశాలలకు స్పోర్ట్స్ కిట్లను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ పీడీజీ కాపా మురళీకృష్ణ మాట్లాడుతూ.. ప్రతీ విద్యార్థి శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండాలంటే ఆటలు తప్పనిసరిగా ఆడాలన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు బెల్లంకొండ ఆంజనేయులు, కోశాధికారి శీలం వెంకట్‌రెడ్డి, శ్యాంబాబు, కర్నాటి లక్ష్మారెడ్డి, పెనుగొండ ఉపేందర్‌రావు, కోటేశ్వరరావు, కటికి వెంకటేశ్వర్లు, మురళి పాల్గొన్నారు.

వివేకానంద బోధనలు యువతకు స్ఫూర్తి



పుస్తకాలు అందుకున్న విద్యార్థులతో ఆర్టీసీ డీఎం రాజ్యలక్ష్మి

సత్తుపల్లిరూరల్: స్వామి వివేకానంద బోధనలు యువతకు స్ఫూర్తిదాయకమని సత్తుపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మి అన్నారు. బుధవారం స్థానిక విశ్వశాంతి పాఠశాలతో పాటు పలు పాఠశాలల్లోని విద్యార్థులకు వివేకానంద జీవితచరిత్ర పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన జీవితంపై పరీక్షలు నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో నిర్వాహకులు పి.నాగేశ్వరరావు, సత్యనారాయణ, పులి శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి

కారేపల్లి: ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని పీవైఎల్, పీఓడబ్ల్యూ జిల్లా నాయకులు ఎస్పీ రాకేష్, గుమ్మడి సందీప్‌లు అన్నారు. బుధవారం మండలంలోని టేకులగూడెం గ్రామంలో పీవైఎల్, పీఓడబ్ల్యూ సంఘాల ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. అనేకమంది ప్రజలు ప్రభుత్వ వైద్యశాలల్లో మెరుగైన వైద్యం అందక దిక్కుతోచని స్థితిలో ప్రైవేట్‌ను ఆశ్రయిస్తే.. వారు ఇదే అదునుగా భావించి భారీగా ఫీజులు వసూలు చేస్తున్నారని తెలిపారు. ఇకనైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి మెరుగైన వైద్యం అందించాలన్నారు. ప్రైవేట్ దోపిడీని అరికట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా దశలవారి ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ మండల కార్యదర్శి కనకరాజు, అశోక్, జ్యోతి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మాలల సింహగర్జనను విజయవంతం చేయండి

మధిర: హైదరాబాద్ జింఖానా గ్రౌండ్‌లో డిసెంబరు ఒకటిన జరిగే మాలల సింహగర్జన బహిరంగ సభను విజయవంతం చేయాలని ఇండియన్ మాల లాయర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మద్రి ప్రకాష్ కోరారు. బుధవారం మధిర మున్సిపాలిటీ పరిధిలోని మడుపల్లి గ్రామంలో తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్, మాల మహానాడు జేఏసీ ఆధ్వర్యంలో మాలల సింహగర్జన గోడపత్రికలను ఆవిష్కరించారు. ఐక్య పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం నాయకులు లక్ష్మణరావు, రిటైర్డ్ ఎంపీడీఓ మురహరిరావు, మాల మహానాడు ముఖ్య నాయకులు రాజేందర్, శివ, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఆసరాగా నిలవండి

కారేపల్లి: పేద, మధ్య తరగతి వర్గాలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు పాలక ప్రభుత్వాలు ఆసరాగా నిలవాలని ధర్మసమాజ్ పార్టీ మండల కన్వీనర్ గుండమల్ల కార్తీక్ కుమార్ అన్నారు. బుధవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో సింగరేణి నాయిబ్ తహసీల్దార్ లక్ష్మి కి వినతి పత్రం అందించి మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలు అధికంగా ఉన్న రాష్ట్రంలో సామాజిక న్యాయం కరువైందని, ఇప్పటికైనా.. పేద వర్గాలకు అవసరమైన విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇల్లు కల్పించి వారి అభ్యున్నతికి పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మసమాజ్ పార్టీ మండల కమిటీ సభ్యులు మానస, సాయికుమార్‌లు పాల్గొన్నారు.


పాడి రైతులకు ప్రోత్సాహకాలు



ఇనగాలిలో ప్రోత్సాహకాలు అందిస్తున్న మేనేజర్ సాంబశివమూర్తి

ఎర్రుపాలెం: మండలంలోని ఇనగాలి గ్రామంలో బుధవారం పాడి రైతులకు తిరువూరు చిల్లింగ్ సెంటర్ మేనేజర్ టి.సాంబశివమూర్తి ప్రోత్సాహక నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన పాల ఉత్పత్తుల పెంపకానికి తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. ఈ కార్యక్రమంలో పాడి ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షులు చిన్న వెంకటేశ్వర్లు, శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ ప్రభాకరారావు, వేతన కార్యదర్శి మాధవరెడ్డి తదితరులున్నారు.

ఒంటరి మహిళలను ప్రభుత్వం ఆదుకోవాలి



మాట్లాడుతున్న లలితాదేవి

వేంసూరు: రాష్ట్రంలో పలురకాల సమస్యలతో బాధపడుతున్న వితంతువులు, ఒంటరి మహిళలను ఆదుకోవాలని అఖిల భారత మహిళా సమాఖ్య ఎస్ఎఫ్ఐడబ్లు రాష్ట్ర కార్యదర్శి ఏపూరి లతాదేవి అన్నారు. బుధవారం మండలంలోని తహసీల్‌లో రామలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో లలితాదేవి మాట్లాడారు. ఒంటరిమహిళ, వింతంతువుల పట్ల పాలక ప్రభుత్వాలు సవతితల్లి ప్రేమ చూపుతున్నాయని, వారి సమస్యల పరిష్కారానికై పోరాటానికి సిద్ధం కావాలన్నారు. అనంతరం వంటరి, వితంతు మహిళల నూతన కమిటీని ఎన్నుకోగా.. అధ్యక్షురాలిగా సాధు సూరమ్మ, కార్యదర్శిగా కనపర్తి సుజాత, ఉపాధ్యక్షురలిగా నాగలక్ష్మితో పాటు మరో 15మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దండు ఆదినారాయణ, మహిళా సమైఖ్య ఎస్ఎఫ్ఐడబ్ల్యూ సత్తుపల్లి డివిజన్ కన్వీనర్ రంజాన్‌బి, రామలక్ష్మి, సూరమ్మ, సత్యవతి, సీతమ్మ భాగ్యమ్మ, సరోజిని, ఆయేషా, కుమారి, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.